క్లుప్తంగా

రేపు వసంత పంచమి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధదేవాలయమైన మహా సరస్వతీ ఆలయంలో ఈనెల 26న గురువారం వసంత పంచమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు సరస్వతీ హోమం, 9.30గంటలకు సామూహిక అక్షరస్వీకారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహాముత్తారం/కాటారం: మహాముత్తారం, కాటారం మండలంలోని గంగారం మోడల్ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ రాము, మధు మంగళవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7 నుంచి 10 తరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. పూర్తి సమాచారం కోసం పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ర్యాలీని సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో చైన్నైలో ఫిబ్రవరి 3, 4వ తేదీల్లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రిక్రూట్మెంట్ అధికారి సజ్జ శ్రీ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ బయాలజీ బ్యాక్ గ్రౌండ్ లేదా డిప్లొమా ఇన్ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ చేసిన పురుషులకు సంబంధించి నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 3న ఇంటర్ అర్హతగలవారికి, 4వ తేదీన డిప్లొమా, బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఆన్‌లైన్‌లో లేదా 93453 77868 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

పలిమెల: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుచ్చక్క ఆధ్వర్యంలో నేడు (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా మండలంలోని మండల స్థాయి అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఆధార్‌లింకు చేసుకోవాలి

కాళేశ్వరం: మండలంలోని ఉపాధిహామీ జాబ్ కార్డులకు ఆధార్‌కార్డులను లింకు చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. కాళేశ్వరంలో పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించిన అనంతరం మాట్లాడారు. మండలంలో మొత్తం 12వేల వరకు జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. 88శాతం వరకు జాబ్ కార్డులు ఆధార్‌తో లింకు అయ్యాయన్నారు. మిగితా జాబ్‌కార్డుదారులు త్వరగా లింకు చేసుకోవాలని సూచించారు. లింకు చేయకపోతే ఉపాధిహామీ కూలి డబ్బులు ఖాతాల్లో జమకావన్నారు. ఆయన వెంట సర్పంచ్ వసంత, ఉపాహామీ ఏపీఓ రమేష్, కార్యదర్శి సత్యనారాయణలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి సిరొంచ నాయకులు!

కాళేశ్వరం: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లోని గడ్చిరోలి జిల్లా సిరొంచ ప్రాంత నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ వైపునకు అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. ఖమ్మంలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్‌పార్టీ సిద్ధాంతాలు, కార్యచరణ తెలుపడంతో సిరొంచ ప్రాంతంలో కొంత మంది నాయకులు మంగళవారం సీఎం కేసీఆర్‌ను హైదరబాద్‌లో కలిశారు. దీంతో మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరొంచ తదితర ప్రాంతాల నాయకులు బీఆర్‌ఎస్‌లోకి వెళ్తున్నారని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీతో మహారాష్ట్ర వైపున వందల ఎకరాల్లో పంట నష్టపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే మీరెలా బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళుతారని వారికి నిరసన సెగలు కూడా ఎదురవుతున్నట్లు తెలిసింది.

పరామర్శ



కాటారం: మండలంలోని ఒడిపిలవంచకు చెందిన మేడ వెంకటరాజయ్య మంగళవారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి పరామర్శించారు. మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ఉడుముల విజయారెడ్డి, ప్రధాన కార్యదర్శి పూసాల రాజేంద్రప్రసాద్, శ్రీహరి, వేముల రమేష్, లింగయ్య తదితరులు ఉన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కాళేశ్వరం: కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్

మహదేవపూర్: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కేంద్రం నిర్వహణ, సర్పంచ్ శ్రీపతిబాపు పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక కంటి వ్యాధులకు పరిష్కారంగా కంటి వెలుగు శిబిరాలు ప్రజలకు మేలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య బృందం, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని సర్పంచ్ మండల లతారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని పరీక్షలు చేయించుకొని అద్దాలు తీసుకున్నారు. అనంతరం మాట్లాడారు. కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సురేష్, మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణు, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఫిబ్రవరి 3 వరకు కంటి వెలుగు కార్యక్రమం జరుగుతుందని పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు తరలి వచ్చి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆసుపత్రికి సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు ఇంటికి తిరిగి ఆహ్వాన పత్రాలు అందజేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట వైద్యాధికారి సుస్మిత, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, కంటి వెలుగు ఇన్‌చార్జ్ రవి, కార్యదర్శి సత్యనారాయణలు ఉన్నారు.



మహదేవపూర్: కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య



మహాముత్తారంలో..

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఎస్సై అరుణ్

పలిమెల: గ్రామాల్లో అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా మంగళవారం మండలంలోని ముకునూరు పంచాయతీ పరిధిలోని గొత్తికోయగూడెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై అరుణ్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. యువత ప్రలోభాలకు లొంగకుండా మంచిగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాక్షించారు. కాలం చెల్లిన మావోయిస్టు సిద్ధాతాలు, ప్రలోభాలకు లొంగొద్దని సూచించారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో ఉత్తమ ఉద్యోగులు వీరే..

- 11 ఏరియాల నుంచి 11మంది ఎంపిక

సింగరేణి(కొత్తగూడెం): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. సంస్థ వ్యాప్తంగా 11 ఏరియాల నుంచి 11మందిని ప్రకటించగా, వీరిని గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం కొత్తగూడెంలోని కార్పొరేట్ ఏరియాలో జరిగే వేడుకల్లో సన్మానించనున్నారు. ఈ సందర్భంగా ఏరియాల వారీగా ఎంపికైన ఉత్తమ ఉద్యోగుల వివరాలు... చిలుకూరి నర్సింహారావు(జీఎం, కార్పొరేట్ ఏరియా), దొణికెల భాస్కర్(ఫర్నస్‌మెన్, కేటీకే ఓసీ, భూపాలపల్లి), బోగ శంకరయ్య(ఈపీ ఆపరేటర్, ఆర్జీ–3 ఏరియా ఆండ్రియాల ప్రాజెక్ట్), అవధూత వెంకటేశ్వర్లు(ఈపీ ఆపరేటర్, జీడీకే ఓసీ, ఆర్జీ–2 ఏరియా), అడ్డగీతల గోపి(ఈపీ ఆపరేటర్, జీడీకే–2, 2ఏ అండ్ 5, ఆర్జీ–1 ఏరియా), సంపత్ తిరుపతి(ఈపీ ఆపరేటర్, ఖైరిగూడ ఓసీ, బెల్లంపల్లి ఏరియా), పెరుక బీమయ్య(కోల్ కట్టర్, కేకే–5 ఇంక్లయిన్, మందమర్రి ఏరియా), అస్సాం శ్రీనివాస్(ఎస్‌డీఎల్ ఆపరేటర్, ఎస్ఆర్‌పీ–1, శ్రీరాంపూర్ ఏరియా), గంగాధర నసేంద్ర కుర్తీప్(ఈపీ ఆపరేటర్, పీకే ఓసీ, మణుగూరు ఏరియా), ఆర్.అశోక్‌కుమార్(హెడ్ ఓవర్‌మెన్, ఇల్లెందు ఏరియా), జె.శ్రీరామ్మూర్తి(ఈపీ ఎలక్ట్రీషియన్, జేవీఆర్ ఓసీ, కొత్తగూడెం ఏరియా)తో పాటు ఎన్.జీ.రాజు(సీనియర్ వార్డ్ అసిస్టెంట్, ఎస్టీపీపీ) ఉత్తమ సింగరేణియన్లుగా ఎంపికైన వారిలో ఉన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



మార్కండేయ జయంతి వేడుకల్లో నాయకులు

చిట్యాల: పద్మశాలీ కులదైవమైన మార్కండేయ జయంతిని మండలకేంద్రంలో పద్మశాలీ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఈగ కోటేశ్వర్, పద్మశాలీ సంఘం చిట్యాల మండల అధ్యక్షుడు కట్కూరి నరేందర్‌లు మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులు, బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సామల రమేష్, సహాయ కార్యదర్శి సామల ధనుంజయ, కోశాధికారి సామల రాజేందర్, ఆడిట్ సభ్యుడు చిప్ప విశ్వనాథ్, సంఘం సభ్యులు నాగుల రమేశ్, క్యాతం మార్కండేయ, చింతకింది దశరథం, సామల కష్ణస్వామి, సామల యాదగిరి, లకుమ్ చంద్రమౌళి, దొంత శ్రీనివాస్, తాళ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



మహాముత్తారం: విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న పోలీసులు

మహాముత్తారం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా 58 బెటాలియన్‌కు చెందిన సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మంజుల ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్కు, పెన్నులు, స్కూల్‌బ్యాగ్స్ పంపిణీ చేశారు. అనంతరం డీఎస్పీ రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి చదువు నేర్పిన గురువులతో పాటు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లోని యువకులు చెడువ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వస్తే అలాంటి వారికి సహకరించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ రంజిత్‌రావు, మహాముత్తారం ఎస్సై రమేష్, సీఆర్పిఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

పలిమెల: ప్రజలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కేవీ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నూతన పోలీస్‌స్టేషన్‌లో సీఆర్‌పీఎఫ్ పోలీస్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్‌లు, పెన్నులు అందజేశారు. యువకులకు వాలీబాల్, క్రికెట్, షెటిల్ కిట్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవ్‌పూర్ సీఐ కిరణ్, పలిమెల ఎస్సై అరుణ్, మహదేవపూర్ ఎస్సై భవాని తదితరులు పాల్గొన్నారు.



పలిమెల: విద్యార్థులకు బ్యాగులు, యువకులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న పోలీసులు

అభివృద్ధి పనుల పరిశీలన



మహదేవపూర్: సెగ్రిగేషన్‌షెడ్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ



పలిమెలలో..

మహదేవపూర్: మండలం కేంద్రంలో కొనసాగుతున్న సెగ్రిగేషన్‌షెడ్ పనులను డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. వర్మీ కంపోస్టు సేంద్రియ ఎరువు తయారీ గురించి గ్రామ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతిబాపు, ఎంపీఓ ప్రసాద్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలిమెల: మండలంలోని లెంకలగడ్డలో మన ఊరు–మన బడిలో నిర్మిస్తున్న పాఠశాల ప్రహరీ పనులను ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతతో పాటు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

చిట్యాల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సరిగోమ్ముల సమ్మయ్యను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజుతో పాటు డీలర్లు బోల్లెపల్లి దేవేంద్ర సాంబయ్య, బుర్ర సాదయ్య, త్రీలోకేందర్‌రెడ్డి, సదయ్య, పాపాచారి, స్వామిదాసు, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీకి గురవుతున్న భాషా పండితులు



నాగారం ప్రాథమికోన్నత పాఠశాలలో నిరసన వ్యక్తంచేస్తున్న ఉపాధ్యాయులు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో భాషా పండితులకు పదోన్నతులు లేక శ్రమదోపిడీకి గురవుతున్నారని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎండీ దిల్షాద్ ఆరోపించారు. ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలో భాషా పండితులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా దిల్షాద్ మాట్లాడుతూ జిల్లాలో భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు దాదాపు 187మంది ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. లేనిచో దశల వారీగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సాధించేవరకు అలుపెరుగని పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు రాజేంద్రన్, రాజ్‌కుమార్, రమేష్, శిరీష, సంధ్యారాణి పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ ప్రారంభం



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మహదేవపూర్: మండలంలోని రాపెల్లికోట, ఎన్కపల్లి, కిష్టారావుపేట గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను మంగళవారం ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుండడంతో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సిఫారసు మేరకు జెడ్పీటీసీ గుడాల అరుణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వామన్ రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన డిపో మేనేజర్ ఆయా గ్రామ ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ ప్రజలు, విద్యార్థులు బస్సులో ప్రయాణం చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూరారం, అంబట్‌పల్లి ఎంపిటిసిలు మడక తిరుమల, ప్రతాప్ రెడ్డి, బీసుల జయశ్రీ, ఉప సర్పంచ్ బట్టి శ్రీశైలం, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జమీల్, ఆర్టీసీ సీఆర్పీ చంద్రమౌళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసుల దాడులు



బెల్లంపానకం పారబోస్తున్న ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

కాటారం: కాటారం మండలం గంగారంలో నిర్వహిస్తున్న గుడుంబా తయారీ కేంద్రాలపై మంగళవారం ఎక్సైజ్ సీఐ ప్రశాంతి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. 40 లీటర్ల గుడుంబా, 40 కిలోల బెల్లం, ఐదు కిలోల పట్టిక స్వాధీనపర్చుకొని 800 లీటర్ల బెల్లంపానకం పారబోసినట్లు పేర్కొన్నారు. తయారీకి పాల్పడుతున్న కవిత, లక్ష్మణ్, రాజ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో సీఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు పదోన్నతులు



పదోన్నతి పత్రం ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మల్హర్: మండలంలోని ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్‌లో పని చేస్తున్న అర్హులైన 69 మంది కార్మికులకు పదోన్నతులు లభించినట్లు మైన్ వైస్ ప్రసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కాపురంలోని మైన్ క్యాంప్ కార్యాలయంలో పదోన్నతులు పొందిన కార్మికులకు ప్రభాకర్‌రెడ్డి పదోన్నతి పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోన్నతులు పొందిన కార్మికులను మునుముందు కూడ క్రమశిక్షణలతో పని చేస్తూ, బొగ్గు ఉత్పత్తి పెంచడంలో కృషి చేయాలని సూచించారు. అలాగే ఇతర కార్మికులు కూడా క్రమశిక్షణలతో పని చేసి పదోన్నతులకు అర్హులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, మైన్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి, డీజీఎం హెచ్‌ఆర్ రవికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిట్యాల: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుట్ల తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఏసీడీ పేరిట పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక సంవత్సరంలోనే అనేకసార్లు కరెంటు బిల్లులను పెంచి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని, లేదంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని అన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షుడు మెరుగు లక్ష్మి, దివ్యాంగుల చైర్మన్ కొడారి సారయ్య, ఎంపీటీసీ అనిల్, ఎస్సీ సెల్ నాయకుడు రవి, చిట్యాల టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, నాయకులు రాయ కొమురు, శ్రీనివాస్, దొడ్డి కిష్టయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, కుమార్, మార్కండేయ, రాజమౌళి, తిరుపతి, సురేందర్, నరేష్, మొగిలి, సాంబయ్య, సదానందం, కరుణాకర్, సురేష్, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే అమ్మాలి

చిట్యాల: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఎమ్మార్పీకే అమ్మాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన ఎరువుల డీలర్లకు నూతన లైసెన్స్ ఆన్‌లైన్ విధానం గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాదారులు లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. ప్రతి ఎరువుల షాపులో స్టాక్‌బోర్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. టెక్నికల్ ఏఓ దేవేందర్‌రెడ్డి, ఏఈఓలు రమణకుమార్, సన్ని, సుమంత్, సందిప్, రూపిక, రాహూల్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొర్లకుంట గ్రామానికి చెందిన సర్వ స్రవంతి అనే మహిళను అదే గ్రామానికి చెందిన సర్వ రాజబాపు, వనజ అనే ఇద్దరు వ్యక్తులు ఒక పంచాయితీ విషయంలో దూషించి కొట్టారు. ఈ మేరకు స్రవంతి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఒకరిపై కేసు

మండలంలోని సింగారం గ్రామానికి చెందిన అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపెల్లి గ్రామంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ వద్ద సింగారం గ్రామానికి చెందిన బొబ్బిలి రాజు అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన తిర్రి అశోక్ అనేవ్యక్తి దాడి చేసి చంపుతానని బెదిరించడంతో రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అశోక్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.